క్లుప్తంగా

డంపింగ్ యార్డులో చెత్త కాల్చొద్దు



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

సుల్తానాబాద్: డంపింగ్ యార్డులో చెత్త వేసి కాల్చడంతో పొగ, దుమ్ముతో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణమంతా సేకరించిన చెత్తను మార్కండేయ కాలనీలో నిల్వ చేయడంతో పాటు రాత్రివేళలో కాల్చడంతో కాలనీ మొత్తం పొగతో నిండిపోతోందని, దీంతో కాలనీవాసులకు శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు నాయకులు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతల సునీత, రాజు, దున్నపోతుల రాజయ్య, కుమార్ కిషోర్, రేగుల ధర్మేందర్, రాజు, నాగరాజు, ఆవేటి దేవయ్య ఉన్నారు.

మొక్కలు పడిపోతున్నా పట్టించుకోరా?

పెద్దపల్లిరూరల్: హరితహారంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను కాపాడడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి మండలం పాలితం గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులను పర్యవేక్షించేందుకు వెళ్లారు. పెద్ద మొక్క నేలవాలి కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కను పైకిలేపి సిబ్బంది సాయంతో తాళ్లతో కట్టించారు. మొక్కలను కాపాడాలని, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండిపోకుండా చూడాలని ఆదేశించారు. ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్ ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కమాన్‌పూర్: ఎరువుల షాపు యజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రామగిరి రవిప్రసాద్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండల వ్యవసాయాధికారి భూక్య మోహన్‌తో కలిసి ఫర్టిలైజర్ షాపుల యజమానులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, అందుకు తగిన రసీదు కూడా ఇవ్వాలని సూచించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ఎస్సైగా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలపై దళారులను ఆశ్రయించకుండా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు, రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఏఎస్సైలు రఘు, నీలిమ, హెడ్ కానిస్టేబుల్ ఆనందం ఉన్నారు.

అనాథ బాలికకు ఎన్‌ఆర్‌ఐ ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న స్థానిక మిత్రులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మోత్కూరి అమూల్య మూడేళ్ల క్రితమే తల్లిదండ్రులను కోల్పోవడంతో అనాథగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి లండన్‌లో ఉండే తన మిత్రురాలు సరితారెడ్డికి ఈ విషయం తెలపడంతో స్పందించి శుక్రవారం రూ.10వేల నగదు పంపించారు. భవిష్యత్‌లో కూడా తన సహకారం ఉంటుందని బాలికతో ఫోన్‌లో మాట్లాడి భరోసా ఇచ్చారు. కాగా స్థానికంగా ఉన్న నిమ్మరాజుల రవి, పుల్లి శ్రీనివాస్ అనాథ బాలిక అమూల్యకు నగదు అందజేశారు.

మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో నిరసన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో 38వ డివిజన్‌కు చెందిన ఎంచర్ల మహేశ్‌యాదవ్ అనే యూత్ కాంగ్రెస్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శుక్రవారం నేలపై బైఠాయించి నిరసన తెలిపాడు. 38వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశాడు. గతంలో అనేసార్లు సమస్యలపై వినతిపత్రం ఇచ్చినప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. స్పందించిన కమిషనర్ ఇలా నిరసన చేయడం సరికాదని, నేరుగా డివిజన్‌కు వచ్చి సమస్యలు పరిశీలిస్తానని తెలిపారు.

వారసంతలో వసతులు శూన్యం

- ఏటా రూ.3లక్షల ఆదాయం
- 40ఏళ్లుగా రోడ్డుపైనే విక్రయిస్తున్న రైతులు, విక్రయదారులు
- ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోని పాలకవర్గం, అధికారులు



రోడ్డుపైనే వారసంత నిర్వహణ

ధర్మారం: మండల కేంద్రంలోని వారసంత గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులకు ఉపయోగపడుతుంది. ఇంటి అవసరాలకు నిత్యవసరాల వస్తువులతో పాటు కూరగాయలు, పండ్లు లభిస్తాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, చిరువ్యాపారులకు వారసంతలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ వారసంతపై పంచాయతీకి ఏటా రూ.లక్షల ఆదాయం వస్తున్నప్పటికీ వారసంత గురించి పట్టించుకోవటం లేదు. కనీసం వారసంతకు స్థలం కేటాయించలేదు. దీంతో 40ఏళ్లుగా రాష్ట్ర రహదారిపై ఇరువైపులా పాత బస్టాండు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు రైతులు, చిరువ్యాపారులు కూర్చుండి విక్రయిస్తుంటారు. వ్యాపారులతో పాటు కొనుగోలుదారులతో రోడ్డు రద్దీగా ఉంటుంది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలగడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఏటా రూ.3లక్షల ఆదాయం

ధర్మారంలో ప్రతి మంగళవారం నిర్వహించే కూరగాయల వారసంతకు ఏడాదికి రూ.3లక్షల ఆదాయం గ్రామపంచాయతీకి సమకూరుతుంది. దాదాపు 40ఏళ్లకు పైగా వారసంతకు ఆదాయం వస్తూనే ఉంది. ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ సంత కోసం ప్రత్యేకమైన స్థలం కేటాయింపు గురించి పాలకవర్గాలు పట్టించుకోలేదు. స్థానిక యువకులు వారసంతకు స్థలాన్ని కేటాయించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. విక్రయదారులు రోడ్డుకు ఇరువైపులా కొంతమంది డేరాలు కట్టుకోగా మరికొంత మంది చెట్ల కింద వస్తువులను విక్రయిస్తుంటారు. కూరగాయల వ్యాపారులతోపాటు రైతులు రోడ్డు సమీపంలోనే ఉండి విక్రయించటంతో వారసంత రోజు ఆ ప్రాంతం ప్రమాదకరంగా ఉంటుంది. వ్యాపారులు, వినియోగదారులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు లేక మహిళల బాధ వర్ణనాతీతం. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి వారసంతకు ప్రత్యేకమైన స్థలం కేటాయించాలని రైతులు, విక్రయదారులు కోరుతున్నారు.

స్థలం కేటాయించాలి



ప్రతివారం పెద్ద ఎత్తున జరిగే వారసంతకు ప్రభుత్వం స్థలం కేటాయించాలి. వారసంతకు వేలాది మంది వచ్చి కూరగాయలు ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. కానీ హైవేరోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు ఉండటంతో విక్రయదారులు రోడ్డు దాటుతుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. జనం రద్దీతో ప్రతివారం దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. – కిషోర్, అంబారీపేట

ఎవరూ పట్టించుకుంటలేరు



రూ.లక్షల ఆదాయం సమకూర్చుతున్న వారసంతను పంచాయతీ పాలకవర్గం, అధికారులు పట్టించుకుంటలేరు. స్థలం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్డి సౌకర్యం లేదు. ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే వారసంతను ప్రభుత్వం స్థలంలోకి తరలించి సౌకర్యాలు కల్పించాలి.

– గడ్డం కొమురెల్లారెడ్డి, బంజేరుపల్లి

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

గోదావరిఖని: సింగరేణి పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ డిమాండ్ చేశారు. స్థానిక విఠల్‌నగర్ జోన్‌లోని సివిల్ డిపార్ట్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను శుక్రవారం కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తఫా, నాయకులు చుక్కల శ్రీనివాస్, తాళ్లపెల్లి యుగేందర్, బొంతల లచ్చన్న, వీరబోయిన రవియాదవ్, కొప్పుల శంకర్, గాజుల కిరణ్, ధూళికట్ట సతీశ్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పాలకుర్తి: క్రీడలతో శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బసంత్‌నగర్‌లోని కేశోరాం వర్కర్స్‌క్లబ్ గ్రౌండ్‌లో లునావత్ దిలీప్‌కుమార్ స్మారకార్థం శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు పాత రవీందర్, వాసుదేవరావు, మహేందర్, మోహన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇటీవల జరిగిన ఘటనల నేపథ్యంలో బాధిత కుటుంబాలను శుక్రవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ పరామర్శించారు. పార్టీ ప్రతినిధులు గాదె సుధాకర్, మడ్డి తిరుపతి, దొరిశెట్టి భోజన్న, రాజేందర్, శ్యాం, ముక్కెర రాములు, లగిశెట్టి తిరుపతి, సీతారాములు, సత్యనారాయణ, ఎలుగల రవీందర్, గుంట హన్మంతు, సంఘన వేణ శేఖర్, గుంట ఆనందం ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న విజయరమణారావు

ఓదెల: ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించడానికి రైతులు ఎండలో పడిగాపులు కాస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కొనుగోళ్లలో కొర్రీల పేరిట రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, ఉపసర్పంచులు గుగులోతు నిమ్మనాయక్, లింగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తీర్థాల వీరన్న, నాయకులు సదయ్య పాల్గొన్నారు.

అన్నదాతలను అష్టకష్టాలు పెడుతున్నారు



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను అష్టకష్టాలు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాశిపేటలింగయ్య, నాయకుడు కౌశికహరితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదని, ఇంకెప్పుడిస్తరో చెప్పాలని ప్రశ్నించారు. పరిహారం అందించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని తెలిపారు. నాయకులు కన్నం అంజయ్య, సంజీవరెడ్డి, పిన్నింటి రాజు, సమ్మయ్య, రామన్న, సదానందం, ఫహీం, రాజు, కుమార్ తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై అభ్యంతరం



అభ్యంతరం తెలుపుతున్న స్థానికులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని రాంనగర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టడానికి శుక్రవారం వెళ్లిన రామగుండం నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని స్థానికులు అడ్డుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఫైవింక్లయిన్ చౌరస్తా వరకు 100ఫీట్ల రోడ్డు విస్తరణ కోసం గత పాలకవర్గం హయాం నుంచి పనులు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఇరువైపులా 45 ఫీట్లు, మరికొన్ని చోట్ల 40ఫీట్ల చొప్పున విస్తరణ పనులు చేశారు. చాలాకాలంగా ఆగిపోయిన విస్తరణ పనులను శనివారం అధికారులు చేపట్టడానికి రాంనగర్ ప్రధాన రహదారికి పక్కన ఉన్న కట్టడాలను జేసీబీ వాహనంతో తొలగించే పనులు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత కార్పొరేటర్ అడ్డాల గట్టయ్యతోపాటు స్థానికులు విస్తరణ పనుల తీరుపై అభ్యంతరం తెలిపారు. 50 ఫీట్లతో విస్తరణ చేస్తే, ఉన్న కొద్దిపాటి స్థలం మిగిలిన ఇళ్లను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర మేయర్, మున్సిపల్ కమిషనర్ నేరుగా వచ్చి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో బల్దియా సిబ్బంది వెనుదిరిగి వెళ్లిపోయారు.

రచ్చపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సందర్శన

మంథని: స్వచ్ఛ సర్వేక్షణ్‌కు గ్రామాల ఎంపికలో భాగంగా శుక్రవారం మంథని మండలం రచ్చపల్లి గ్రామాన్ని అధికారుల బృందం సందర్శించింది. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించేలా ప్రజలు సహకరించాలని సర్పంచ్ కనవేన శ్రీనివాస్ కోరారు. డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో ఆరిఫ్ ఉన్నారు.

ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా నియామకం



ఎడ్ల రవికుమార్

రామగుండం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు సామాజిక వర్గానికి హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో ఆత్మగౌరవ భవనం నిర్మించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం భవనానికి నూతన ట్రస్టు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అబాది రామగుండంకు చెందిన ఎడ్ల రవికుమార్ పటేల్ అనే హైకోర్టు యువ న్యాయవాదిని ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమించారు.

ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలోని భూపోరాట కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎ.ముత్యంరావు, నాయకులు ఎన్.భిక్షపతి, కృష్ణారెడ్డి, రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, మల్లేశ్, ఉపేందర్, దేవక్క పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: మండలంలోని సూరయ్యపల్లిలో ఉపాధిహామీ పని ప్రదేశం వద్ద కూలీల మధ్య కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి/సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్/కాల్వ శ్రీరాంపూర్/రామగుండం/ధర్మారం/మంథని: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర కేబినేట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఆయా ప్రాంతాల్లో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మున్సిపాలిటీలపైనే ఉందని, పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ ముత్యం సునీతగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్–2023 కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వార్డుల వారీగా మెప్మా, మున్సిపల్ సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జిలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి కాలనీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించినా రూ.1000 నుంచి రూ.5వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా చుట్టుపక్కలా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ప్రజలందరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఆయా కాలనీల్లో స్వచ్ఛతకు మొదటి ప్రాధాన్యం ఇచ్చిన మెప్మాలకు, కౌన్సిలర్లకు రూ.10వేలు బహుమానంగా అందిస్తానని చెప్పారు. ఖాళీ ప్రదేశాలలో కూరగాయ విత్తనాలు నాటుకోవాలని, విత్తనాలను ఇంటింటికీ తానే స్వయంగా 10రకాల విత్తనాలు ఉచితంగా అందిస్తానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజశేఖర్ కౌన్సిలర్లు కూకట్ల గోపి, పారుపల్లి జ్ఞానేశ్వరి, గాజుల లక్ష్మి, గొట్టం లక్ష్మి, కోఆప్షన్ సభ్యులు మేంగని రాధ, స్పెషల్ ఆఫీసర్ భాస్కరచారి, మేనేజర్ అలీమొద్దీన్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఆడిటింగ్



ఆడిటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో శుక్రవారం నుంచి ఆడిట్ జనరల్ అధికారులు ఆడిటింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆస్పత్రిలోని అన్ని వార్డులతోపాటు కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులు, వెచ్చించిన నిధులు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంవోలు తిరుమలేశ, రేణుక, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్ ఫక్రొద్దీన్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోల్‌సిటీ: నగరపాలక సంస్థలోని 26వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్, ప్రజాసంఘాల నాయకులు శనిగరపు చంద్రశేఖర్, మార్కాపురి సూర్య, రేణిగుంట్ల ప్రీతం, తాళ్లపల్లి సురేందర్, కొండ్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు వార్డుల్లో బోర్‌వెల్ ప్రారంభం



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని 3, 17, 26వ వార్డుల్లో శుక్రవారం బోర్‌వెల్‌లను మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి ప్రారంభించారు. ఆయా కాలనీవాసులకు సౌకర్యంగా ఉంటుందనే ఆలోచనతో బాల వికాస సంస్థ వారి సహకారంతో ఈ బోర్‌వెల్ వేయించినట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్లు సుదమల్ల అమ్రేష్, సంధ్య, భిక్షపతి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సంస్థ ప్రతినిధి ప్రశాంత్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. గురువారం రాత్రి ఇక్కడకు వచ్చిన సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కలిసి వినతిపత్రం అందించాశారు. కార్మికుల మారు పేర్లు మార్చాలని, కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, సౌకర్యాలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.

గని మేనేజర్‌కు సన్మానం



సన్మానిస్తున్న కార్మికులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2, 2ఏ గని మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుపతిని శుక్రవారం సన్మానించారు. టీబీజీకేఎస్ నాయకులు దొరగండ్ల మల్లయ్య, ఫిట్ ఇంజనీర్ మల్లేశ్, సెక్షన్ ఇన్‌చార్జి టి.శంకర్, ఇంజినీర్ తిరుపతి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

కమాన్‌పూర్: మండల కేంద్రంలో బొడ్రాయి, భూదేవి, మహాలక్ష్మి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటిరోజు అమ్మవార్ల విగ్రహాలను కమాన్‌పూర్, బాపూజీనగర్, పిల్లిపల్లెతో పాటు గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. కాగా శనివారం కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా జిల్లా కేంద్రంలో టౌన్-1 పరిధిలో శనివారం ఉదయం 7గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ అశోక్ తెలిపారు. టౌన్-1 పరిధిలోని కరీంనగర్‌రోడ్, బాంబే షాపింగ్ మాల్ ఏరియా, భాగ్యనగర్, ఆర్టీసీ డిపో ఏరియా, అర్ఎస్‌టీనగర్ ఏరియా, దేవుని గోవిందుపల్లి, వినాయక టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

◆గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పంచాయతీ కార్మికులు నిర్వహించారు. అబ్బాపూర్, తేలుకుంట, పెద్దాపూర్, చీమలపేట, నాగులపల్లెలో చెత్త తొలగింపు, డ్రైనేజీల్లో చెత్త తొలగించారు. పనులను మండల పంచాయతీ అధికారి కిరణ్ పర్యవేక్షించారు. కార్యదర్శులు లచ్చయ్య, అంజలీధర్ అనిల్, శరత్ ఉన్నారు.

◆వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల గ్రామంలోని రామభద్ర వంతెన సమీపంలో ఎస్సై రామక్రిష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

◆పెద్దపల్లి పట్టణ శివారులో..

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని రంగంపల్లి వద్ద శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు లేని, నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు.

◆ఆయిల్‌పామ్‌పై అవగాహన

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ రైతుభవనంలో శుక్రవారం ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పించారు.

◆23లోగా అభ్యంతరాలు చెప్పండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీకి రూపొందించిన మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 23లోగా చెప్పాలని జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. డయాగ్నోస్టిక్ హబ్, వైద్య విధాన పరిషత్‌లో పోస్టులకు ఈనెల17న ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ జాబితా రూపొందించినటనాయన పేర్కొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే టెలీ కాన్ఫరెన్స్

జూలపల్లి: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ తెలిపారు. కాగా శుక్రవారం మండలంలోని రైతులు కొనుగోలు కేంద్రంలో తూకం, లారీల సమస్యలపై ఆయనకు వివరించారు. దూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాలరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

◆ఉపాధి పనుల పరిశీలన

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఈజీఎస్ ఏపీవో సదానందం, సర్పంచ్ గొల్లె కావేరి పరిశీలించారు.


◆జన ఆరోగ్య సమితిపై అవగాహన

ఎలిగేడు: మండలంలోని బుర్హాన్‌మియాపేటలో జన ఆరోగ్య సమితిపై అవగాహన సమావేశం శుక్రవారం జరిగింది. సర్పంచ్ రాచర్ల కొండయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరిదేవి పాల్గొన్నారు.

◆ఎన్ఎస్‌యూఐలో చేరిక

మంథని: ఏబీవీపీ మంథని నగరశాఖ ఇన్‌చార్జి కన్నూరి అనిల్, బేర పవన్‌తో కలిసి హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము అఖిలాష్, రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకటి సమక్షంలో శుక్రవారం ఎన్ఎస్‌యూఐలో చేరారు.

రాజకీయ లబ్ధి కోసమే ధర్నాలు



మాట్లాడుతున్న ఎంపీపీ

సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే ధర్నాలు చేస్తున్నారని ఎంపీపీ బాలాజీ రావు ఆరోపించారు. సుల్తానాబాద్ మండల పరిషత్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఎంపీపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం రూమ్‌ను తెరిపించాలని గురువారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సూచన మేరకు అభ్యర్థించామని, దీనికి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని పోస్టుమార్టం గది తెరిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేసి లబ్ధి పొందాలని చూడడం హాస్యంగా ఉందన్నారు. నాయకులు బుర్ర శ్రీనివాస్, శ్రీగిరి శ్రీనివాస్, ముత్యం రమేశ్‌గౌడ్, వీరగోని రమేశ్‌గౌడ్, ఏరుకొండ రమేశ్‌గౌడ్, రాజమల్లయ్య ఉన్నారు.